ప్రశాంత వాతావరణం కల్పించాలి



ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన ఔట్ పోస్టులను పటిష్టం చేయాలి. రాత్రి వేళల్లో అక్కడి మహిళా వైద్యులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఆస్పత్రి పరిసరాల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. నైట్ డ్యూటీ చేసే గైనకాలజిస్టులు, ఇతర మహిళా డాక్టర్లకు భరోసా కల్పించాలి. దేశవ్యాప్తంగా వైద్యులు ఒక గంట నిరసన తెలిపితే జరిగే నష్టాన్ని ఊహించలేం. అలాంటి వైద్యులకు స్వేచ్ఛగా పని చేసే వాతావరణం కల్పించాలి.

- డాక్టర్ జి.సురేష్, చర్మవ్యాధుల నిపుణులు, ప్రొద్దుటూరు



భద్రతకు భరోసా ఇవ్వాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే మహిళా వైద్యులు, నర్సులు, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం భద్రత కల్పించాలి. అలా చేసినప్పుడు స్వేచ్ఛగా మహిళలు ఉద్యోగాలు చేయగలుగుతారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన ఘటన చాలా దారుణం. ఇలాంటి ఘటనలు జరిగిన వెంటనే ప్రభుత్వాలు త్వరగా విచారణ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలి.

- మేరి సువర్ణ, హెల్త్ సూపర్‌వైజర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దువ్వూరు

వైద్యులకే రక్షణ లేకుంటే ఎలా?



పేద, ధనిక, కుల, మతం అనే భావన లేకుండా అందరికీ వైద్యం అందించి ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకుంటే.. వారు ఎలా విధులు నిర్వహించాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం ఆపై హత్య ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలు తీసుకురావాలి. వైద్యులు, సిబ్బందిలో మనో ధైర్యం నింపాలి.

- ఎన్.సులోచన, స్టాఫ్‌నర్స్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, అట్లూరు



పోరుమామిళ్ల : వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



బద్వేలు అర్బన్ : చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



బ్రహ్మంగారిమఠం : ఈశ్వరీదేవిమఠంలో విజేతలైన చిన్నారులతో మఠాధిపతి వీరశివకుమారస్వామి

కృష్ణం వందే జగద్గురుం

- భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో కమనీయంగా వేడుకలు జరిపారు. ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. పూజా కార్యక్రమాల్లో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు. ఆయనను శాలువ కప్పి పూలమాలతో యదవ సంఘ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణ, బలరాముల విగ్రహాలకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. హరినామ సంకీర్తన, కృష్ణలీల ప్రవచనం, గౌర హారతి, భగవద్గీత ప్రవచనాలు జరిగాయి. మహాశంకాభిషేకం, మహాపుష్పాభిషేకం, మహా హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 30 వేల మందికిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఇస్కాన్ ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు కృష్ణమందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నెల్లూరు రోడ్డులో గల శ్రీకృష్ణ మందిరం, గాండ్లవీధిలోని గోపాలస్వామి ఆలయం, సిద్దవటం రోడ్డులోని అనంతగిరి క్షేత్రం శ్రీకృష్ణ మందిరాలలో ప్రత్యేక పూజలు చేశారు. తెలుగుగంగకాలనీ సమీపంలోని అనంతగిరి క్షేత్రంలో గల శ్రీకృష్ణ మందిరంలో రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యానకి పెంచలయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బోవిళ్ల సుబ్బారెడ్డి, నందగోపాల్‌రెడ్డి, సభ్యులు సాంబశివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

- పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల చిన్నారులు వేసిన చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలు అలరించాయి. ఆంజనేయనగర్‌లోని కార్తీక్ ప్లేస్కూల్‌లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.

వేణుగోపాలస్వామి దేవస్థానంలో..

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహించారు. అమ్మాయిలకు, అబ్బాయిలకు వేర్వేరుగా నిర్వహించిన ఉట్టికొట్టు పోటీల్లో షణ్ముఖప్రియ, వెంకటలాస్య, కార్తీక్, నరేష్ ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. మ్యూజికల్ ఛైర్స్ పోటీల్లో రుషిత, లిఖిత, కృష్ణకాంత్, పవన్ ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. చిన్న పిల్లలకు నిర్వహించిన రాధాకృష్ణుల వేషధారణ పోటీల్లో నలుగురు నగదు బహుమతులు అందుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు భోజన వసతి కల్పించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెసల నరసింహులు, కార్యదర్శి అచ్యుత రామారావు, రాయిపెద్ది సుబ్బరాయశర్మ, సభ్యులు పాల్గొన్నారు.

ఈశ్వరీదేవి మఠంలో..

బ్రహ్మంగారిమఠం : శ్రీఈశ్వరీదేవి మఠం ఆవరణలో బాలగోకులం పోటీలు నిర్వహించారు. 5 ఏళ్లలోపు చిన్నారులకు శ్రీకృష్ణ గోపికల వేషధారణ, 10 ఏళ్ల లోపు వారికి శ్రీకృష్ణ గోపికల వేషధారణ, పద్యం, శ్లోకం, గానం, డ్రాయింగ్ తదితర పోటీలు ఉంటాయి. వెన్న చిలకడం, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రులు సంప్రదాయ దుస్తులతో చిన్నారులతో కలిసి వచ్చారు. విజేతలకు ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు శేషయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమాపతి, పూర్వపు మఠాధిపతి తమ్ముడు వీరభద్రస్వామి పాల్గొన్నారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణుడి వేషధారణ వేసిన చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. గోపికలను ఆట పట్టించడం, ఉట్టి ఉత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకొన్నారు. అనంతరం గోకుల కృష్ణ, గోపాల కృష్ణా అని పాట పాడి స్వామిని ప్రార్థించారు. వెల్లాలలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి అర్చకుడు వెంకటాచలపతి ప్రత్యేక పూజలు చేశారు.

వీరభద్రస్వామి సన్నిధిలో..

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున వీరభద్ర స్వామి, భద్రకాళీ మాతలకు అభిషేకం చేశారు. సాయంత్రం భక్తుల సమక్షంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



చాపాడు : వీరభద్రస్వామి దేవస్థానంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రొద్దుటూరు కల్చరల్ : కోలాటం ఆడుతున్న మహిళలు

వేణుగోపాలస్వామికి ఎమ్మెల్సీ పూజలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో సోమవారం నిర్వహించిన శ్రీకృష్ణ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి పాల్గొన్నారు. ఆయనను ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పెసల నరసింహులు, అచ్యుత రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం శాలువా, పూలదండతో సత్కరించి, ప్రసాదాలు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్టరక్షణ గురించి గీతోపదేశంతో మానవాళికి దిశానిర్దేశం చేసిన మార్గదర్శి శ్రీకృష్ణుడన్నారు. కృష్ణ తత్వం సమస్త మానవాళికి ఆచరణీయమన్నారు. ఆయన వెంట కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీని సత్కరించి, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు

పిల్లలకు సంప్రదాయాలు నేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవిలత, చిత్రంలో కృష్ణమాచార్య

ప్రొద్దుటూరు : చిన్నారులకు చిన్నప్పటి నుంచే హిందూ సంప్రదాయాలు, నైతిక విలువలను నేర్పించాలని వక్తలు తెలిపారు. మండలంలోని కామనూరు ప్రసన్న వేణుగోపాలస్వామి గోశాలలో విశ్వహిందూ పరిషత్, వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాధవిలత, బ్రహ్మపదం వ్యవస్థాపకులు కృష్ణమాచార్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ హిందువులంతా ఒక చోట చేరి సంప్రదాయంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలా ఏకతాటిపై నడిచి ప్రతి పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చీతిరాల నాగార్జున రావు, వివేకానంద సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీనరసయ్య, మారెళ్ల మల్లికార్జునరావు, వీహెచ్‌పీ నగర అధ్యక్షులు నాగమునిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, వంకదార వీరభద్రయ్య, కాల్వ చలపతి, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ, బలరాములు



ప్రొద్దుటూరులో ఇస్కాన్ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవులు

నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు : శ్రీస్వామి అయ్యప్ప సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. సంఘం అధ్యక్షుడు నామా రమేష్‌బాబు అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారని ఆయన పేర్కొన్నారు. పెన్నానది తీరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కొవ్వూరు రమేష్ రెడ్డిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా శ్రీరాం వెంకటరమణ, కార్యదర్శిగా నటకల సతీష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా బచ్చు నంద కిశోర్, నిచ్చెనమెట్ల సుధీర్ కుమార్, కోశాధికారిగా టంగుటూరు వినోద్ కుమార్‌లను ఎన్నుకున్నారని వివరించారు. గౌరవాధ్యక్షులుగా నామా రమేష్ బాబును ఎన్నుకున్నామని, ఈ కమిటీ మూడేళ్ల వరకు సేవలు అందిస్తుందని తెలిపారు.

పెన్షనర్స్ అసోసియేషన్ నూతన భవనం ప్రారంభం



పారిశ్రామికవేత్తలను సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్లరోడ్డులోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 60 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలందించి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు వారి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లు ఐకమత్యంగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతోపాటు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తొలుత విశ్రాంత ఉపాధ్యాయుడు సానపురెడ్డి గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, సెక్రటరీ బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షులు గంజికుంటపుల్లయ్య, కోశాధికారి గంగన్న, గౌరవ సలహాదారులు పుల్లంరాజు, హనుమంత రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.పిచ్చయ్య, ఉపాధ్యక్షులు రామసుబ్బారెడ్డి, ప్రసాద్, ఆనందరావు, శ్రీరాములు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానమే ఆమోదయోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు : ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం మాత్రమే ఆమోదయోగ్యమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో యూనిఫైడ్ పెన్షన్ విధానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఓపీఎస్ మాత్రమే అని, దానికి తప్ప మరే ఇతర పెన్షన్ పథకానికి ఒప్పుకునేది లేదని తెలిపారు. ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకట జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ అనే మూడు ముక్కలాట మాకొద్దని ఓపీఎస్ మాత్రమే ముద్దు అని తెలిపారు. యూపీఎస్‌లో పదేళ్లు ఉద్యోగం చేస్తేనే కనీస పెన్షన్ అంటే పదేళ్లకు ముందే చనిపోయే లేదా పదవీ విరమణ పొందే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సీపీఎస్‌లోని కార్పస్ ఫండ్ రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగికి చెల్లింపు చేసే విషయం, రిటైర్మెంట్ తర్వాత పెన్షనర్‌కు పీఆర్సీ వర్తింపు, క్వాంటం పెన్షన్, హెల్త్ కార్డుల ద్వారా పెన్షనర్‌కు వైద్యం అందించే అవకాశాలు యూపీఎస్‌లో లేవని, ఇది ఆమోదం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజ్వాన్ ఆలీ మాట్లాడుతూ 2004కు పూర్వం నియామకాలు పొందిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో బాల జోజప్ప, చంద్ర ఓబుళరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భార్గవరెడ్డి మాట్లాడారు. నాయకులు మురళీమోహన్, నాగరాజు, జమాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, మస్తాన్‌వలి, రోషన్, జమీర్, మధు, సుధాకర్, కౌశిక్, పరమేశ్వర, బాబా కొండయ్య, బ్రహ్మానందరెడ్డి, ఫయాజ్, మధుసూదన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారం



రోడ్డుపై గుంతలు మట్టితో పూడ్చి చదరం చేయించిన పోలీస్ అధికారులు

పోరుమామిళ్ల : పట్టణంలో ప్రధాన రహదారిపై మూడేళ్ల క్రితం డివైడర్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వర్షాలకు రోడ్డుపై గుంతలు పడి పెద్దవయ్యాయి. గుంతల్లో నీరు నిల్వ ఉండి ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందికరంగా తయారయ్యాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఏ మాత్రం స్పందించలేదు. ఇటీవల జరిగిన మండల సమావేశంలో సభ్యులు గట్టిగా నిలదీయడంతో తమ వద్ద డబ్బు లేదని, మరమ్మతులకు సొంతంగా ఖర్చు చేయాల్సిందేనని, ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని, అందువల్ల తాము ఏమీ చేయలేమని ఏఈ చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ దుర్గామోహన్ రంగంలోకి దిగారు. ట్రాక్టర్లతో మట్టి తెప్పించి, గుంతలు పూడ్చించారు. ఇది తాత్కాలికమైనా, అందరికీ ఊరట కల్గించింది.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిల్లా ఆస్పత్రిలో సోమవారం మదర్ థెరిస్సా 114వ జయంతిని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు బ్రెడ్డులను పంపిణీ చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు చిప్పగిరి ప్రసాద్‌లు మదర్ థెరిసా చేసిన సేవలను కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, గౌరవ సలహాదారుడు సీవీ సురేంద్రబాబు, శ్రీనివాసులు, మాధవ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్‌లో గంజాయి తరలిస్తే చర్యలు



ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ భక్తవత్సలం

ప్రొద్దుటూరు క్రైం : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో గంజాయి, మద్యం, డ్రగ్స్ తరలిస్తే డ్రైవర్‌తో పాటు సంబంధిత యాజమానిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. ఇటీవల ఒక ప్రైవేట్ ట్రావెల్స్‌లో వైజాగ్ నుంచి ప్రొద్దుటూరుకు గంజాయి తరలించిన ఘటన నేపథ్యంలో పట్టణంలోని ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో డీఎస్పీ సోమవారం సమావేశం నిర్వహించారు. విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చేటప్పుడు కొందరు వ్యక్తులు డ్రైవర్ల ద్వారా కవర్లను ప్రొద్దుటూరుకు పంపిస్తున్నారని తెలిపారు. వాటిలో ఏమున్నాయో చూసిన తర్వాతనే కవర్లను తీసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్ సీఐ దేవకిరణ్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రైవేట్ ట్రావెల్స్ ఉదయం 8 గంటల లోపల ప్రొద్దుటూరుకు చేరుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో కూడా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటరమణ

రాజుపాళెం : సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటరమణ పేర్కొన్నారు. రాజుపాళెంలో సోమవారం గ్రామస్తులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడితే.. డబ్బులు నష్టపోతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు శేఖర్, ఉదయ్ భాస్కర్, పవన్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక యానాది కాలనీకి చెందిన కాంతమ్మకు ఆదివారం నిత్యావసర సరుకులను అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సభ్యులు అందించారు. పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామానికి చెందిన సుబ్బిగారి వెంకటయ్య 5వ వర్థంతి సందర్భంగా ఆయన కుమారుడు చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి సహకరించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, పామిడి వీరయ్య యాదవ్ పాల్గొన్నారు.